
ప్రజాశక్తి
శనివారం 2 సెప్టెంబర్ 2023






ఓటర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్ బాబు

శతాబ్దంలో ఇదే అత్యల్పం..!

◆ ఉమ్మడి జిల్లాలో తగ్గిన వర్షపాతం ◆ ఆగస్టు మాసంలో 83.8 శాతం లోటు ◆ ఈ ఏడాది అత్యంత దుర్భిక్షం



కరువుకు నిలయమైన అనంతపురం జిల్లాలో అత్యంత దుర్భిక్ష సంవత్సరంగా ఈ ఏడాది నిలిచిపోనుంది. శతాబ్ధాల కరువు చరిత్రలో ఆగస్టు నెలలో అత్యల్ప వర్షపాతం పడిన సంవత్సరం ఇదే కావడం గమనార్హం. గడిచిన వంద సంవత్సరాల్లో ఎన్నడూ ఈసారిలాగా తక్కువ వర్షపాతం నమోదయిన దాఖలాల్లేవు. జూన్, జులైల్లో సరిగా వానలు లేకపోయినా, ఆగస్టు, సెప్టంబరు మాసాల్లో ఎంతో కొంత వర్షపాతం నమోదయ్యేది. కాని ఈ సంవత్సరం చినుకుజాడ లేకుండా పోయింది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి.



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఖరీఫ్ వర్షాధార పంటకు అత్యంత అవసరమైన మాసం ఆగస్టు మాసమే. వర్షాధారం కింద సీజన్‌లో సాగైన పంట పూత వచ్చి, ఊడలు దిగే సమయం. ఈ సమయంలో వర్షమెస్తే ఎంతోకొంత వరకైనా పంట చేతికొస్తుంది. కాని ఈ ఏడాది ఆగస్టు మాసంలో చూస్తే అత్యల్పంగా 83.7 శాతం వర్షపాత లోటుంది. సాధారణంగా 83.8 మల్లిమీటర్లు వర్షపాతం నమోదవ్వాల్సి ఉంది. కాని పడింది మాత్రం 13.7 మిల్లీమీటర్లు మాత్రమే. ఇది కూడా కేవలం పది మండలాల్లో ఒకటి నుంచి రెండు మిల్లీమీటర్లలోపు పడింది. తక్కిన అన్ని మండలాల్లోనూ నెల మొత్తం చినుకు జాడలేదు. మొత్తం జూన్‌లో సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి నైరుతి రుతుపవనాల కాలంలో ఇప్పటి వరకు సాధారణంగా 210 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 135.1 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయింది. 35.7 శాతం వర్షపాత లోటుంది. అనంతపురం జిల్లా పరిధిలో 31 మండలాలకుగానూ 24 మండలాల్లో వరాభావ పరిస్థితులు నెలకొన్నాయి.

63 సంవత్సరాల్లో ఐదు అత్యంత దుర్భిక్ష సంవత్సరాలు

జూన్ నుంచి సెప్టంబరు వరకు ఈ నాలుగు మాసాల కాలంలో నైరుతి రుతుపవనాల కాలంగా భావిస్తారు. అప్పటి వరకు అరేబియా సముద్రం వైపు నుంచి వచ్చే గాలులతో వర్షాలు పడటం పరిపాటి ఆ తరువాత ఈశాన్య రుతుపవనాలు అక్టోబరు నుంచి మొదలవుతాయి. ఇవి బంగాళతం నుంచి వస్తాయి. అనంతపురం జిల్లాకు మాత్రం నైరుతి రుతుపవనాల కాలంలో వర్షాలు అధికంగా వస్తాయి. జూన్ నుంచి వచ్చే ఏడాది మే వరకు ఏడాది కాలంలో 512 మిల్లీమీర్లు ఉంది. ఇందులో నైరుతి రుతుపవనాల కాలంలోనే 319 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయ్యింది. తక్కిన 193 మిల్లీమీటర్లు అక్టోబరు, నవంబరు మాసాల్లోనే అత్యధికంగా వస్తుంది. ఆ తరువాతి కాలాల్లో వర్షపాతం తక్కువనే ఉంటుంది. ఈ రకంగా చూసినప్పుడు 1960వ సంవత్సరం నుంచి 2023 వరకు చూస్తే ఐదు సంవత్సరాల్లో నైరుతి వర్షపాతం 50 శాతం లోటుతో పడటం గమనార్హం. 1994-95 సంవత్సరంలో నైరుతి కాలంలో సాధారణ వర్షపాతం 297 మిల్లీమీటర్లకుగానూ 129 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయ్యింది. సాధారణం కంటే 57 శాతం వర్షపాతం లోటుంది. ఆ తరువాతి నుంచి 2002-03 సంవత్సరంలో 338 మిల్లీమీటర్లకుగానూ 180 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. సాధారణం కంటే 53 శాతం వర్షపాతం లోటుంది. 2003-04 సంవత్సరంలో 338 మిల్లీమీటర్లకుగానూ 158 మిల్లీమీటర్లు పడింది. 47 శాతం వర్షపాతం లోటుంది.



2018-19 సంవత్సరంలో 338.4 మిల్లీమీటర్లకుగానూ 212.6 మిల్లీమీటర్లు పడింది. 37.4 శాతం లోటు ఏర్పడింది. ఇక ఈ ఏడాది ఇప్పటి వరకు చూస్తే 210 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 135. మిల్లీమీటర్లు మాత్రమే పడింది. 35.7 శాతం లోటుంది.

శతాబ్ధకాలంలో ఆగస్టులో ఇదే అత్యల్పం

ఆగస్టు మాసంలో దేశంలోనే అత్యల్ప వర్షపాతం నమోదయినట్టు వాతావరణ శాఖ చెబుతోంది. దేశ వ్యాప్తంగా సగటు 40 శాతం వర్షపాతం లోటుంది. ఇక అనంతపురం జిల్లా వరకు వస్తే 83.7 శాతం లోటుంది. మొత్తం సంవత్సరాల్లో చూస్తే ఈ ఏడాదే అత్యల్ప వర్షపాతం కలిగిన సంవత్సరంగా భావిస్తున్నాం. సెప్టంబరులో 14లోపు అల్పపీడనం ఏర్పడి వర్షాలొచ్చే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ కాలంలో ఒక వర్షమెచ్చిన రైతులకు కొంత ఊపశమనం ఉంటుంది. ఇక 14లోపు పడకపోతే ఈ నెల కూడా వర్షాభావ పరిస్థితులే ఉండనున్నాయి.

అశోక్ కుమార్, సీనియర్ శాస్త్రవేత్త,
రేకులకుంట వ్యవసాయ పరిశోధనా క్షేత్రం.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-బుక్కపట్నం

ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు ప్రక్రియను నిశితంగా పరిశీలించి పారదర్శకమైన ఓటరు జాబితాను తయారు చేయాలని కలెక్టర్ అరుణ్ బాబు అధికారులకు సూచించారు. శుక్రవారం ఉదయం మండల కేంద్రంలో ఓటరు జాబితా పరిశీలన కార్యక్రమం చేపట్టారు. తొలగించిన ఓటర్ జాబితా పున్ణపరిశీలనలో భాగంగా 39, 43 పోలింగ్ కేంద్రాల్లోని గహాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత ఓటరు జాబితాలను వారి ఇంటి వద్దకే వెళ్లి పరిశీలించి బిఎల్‌వోలు నూతన ఓటరు, రెండు ఓటర్ కార్డు ఉన్నవారి గుర్తించాలన్నారు. రెండు ఓటర్ కార్డు ఉన్నవారికి సంబంధిత ఫారం అందజేయాలన్నారు. రెండు ఓటరు కార్డులు ఉన్నవారికి నిబంధనల మేరకు ఒక ఓటరు కార్డును రద్దు చేయాలన్నారు. మరణించిన వారి ఓటర్ కార్డు రద్దు చేసేప్పుడు చుట్టుపక్కల వారిని అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఓటర్ కార్డు తొలగించేటప్పుడు వివిధ పార్టీల వారి సంతకాలనూ సేకరించాలని ఆదేశించారు. బిఎల్‌వోలు తొలగించేందుకు గుర్తించిన ఓటర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ఓటర్ జాబితా పక్రియ పారదర్శకంగా చేపట్టి 7వ తేదీ లోపు పూర్తి స్థాయి జాబితాను తయారు చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భాగ్యరేఖ, తహశీల్దార్ కరుణాకర్, ఎస్ఐ నరసింహుడు, వీఆర్వోలు లక్ష్మీనారాయణ రెడ్డి, కష్ణయ్య బిఎల్‌వో చంద్రకళ పాల్గొన్నారు.

గుండెపోటుతో బిఎస్‌ఎఫ్ జవాను మృతి

మేడాపురంలో విషాద ఛాయలు

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

మండల పరిధిలోని మేడాపురం గ్రామానికి చెందిన బిఎస్ఎఫ్ జవాను శుక్రవారం తెల్లవారుజామున ఢిల్లీలో గుండె పోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వారి వివరాల మేరకు.. పసల పూజారి ఉమామహేశ్వర్(47) మేఘాలయ రాష్ట్ర రాజధాని షిల్లాంగ్ నగరంలో బిఎస్ఎఫ్ జవానుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. గురువారం రాత్రి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి గంట పాటు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఉన్నఫళంగా గుండెనొప్పి రావటంతో తోటి జవాన్లు ఢిల్లీలోని ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయాన్ని బిఎస్ఎఫ్ జవాన్లు మేడాపురంలోని భార్యకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విసిపించారు. జవాను మృతి వార్తతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



పసల పూజారి ఉమామహేశ్వర్ (ఫైల్‌ఫొటో)

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-పెనుకొండ

గర్భిణులు పౌష్టికా హారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మను ఇవ్వగలరని పెనుకొండ ఐసిడిఎస్ సిడిపిఒ శాంతలక్ష్మి సూచించారు. పట్టణంలోని అర్బన్ సెక్టార్ కొత్తపేట అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు బాలికలకు వివాహం చేస్తే తొందరగా గర్భం దాల్చి అనారోగ్య సమస్యలతో కూడిన బిడ్డలకు జన్మనిస్తారని తెలిపా రు. ఒక్కో సందర్భంలో తల్లి, బిడ్డ మరణించే ప్రమాదం కూడా లేకపోలేదన్నారు. కావున 18 ఏళ్ల నిండిన తర్వాతే యువతులకు వివాహం చేయాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు అన్ని రకాల పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వి.పుష్పలత, ఎఎన్ఎం పర్వీన్‌బేగం, జిఎంఎస్ కె.నందిని, ఎడబ్ల్యుడబ్ల్యు అనిత, నీరజ, శోభాబాయి, ఎడబ్ల్యుహెచ్ అనిత, రత్నమ్మ, పాల్గొన్నారు.



గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ శాంతలక్ష్మి



తిరుమల ఆలయంలో ధ్వజ స్తంభానికి మొక్కుతున్న టిటిడి బోర్డు సభ్యులు తిప్పేస్వామి

టిటిడి బోర్డు సభ్యునిగా ఎమ్మెల్యే తిప్పేస్వామి ప్రమాణస్వీకారం

మడకశిర : తిరుమల తిరుపతి దేవస్థానంలో పాలక మండలి సభ్యునిగా శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆయన శ్రీవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కు తీర్చుకొన్నారు. తనపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన సిఎం జగన్‌కి జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు. శ్రీవారి ఆలయంలో భక్తులకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అలాగే దేవాలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, ఎమ్మెల్యే అభిమానులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సిలో మడకశిర వాసికి చోటు

మడకశిర : అంతర్జాతీయ మానవ హక్కుల రక్షణ కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సి)లో జిల్లా వాసికి చోటు దక్కింది. ఎన్‌హెచ్‌ఆర్‌సి సమావేశంలో జాతీయ అధ్యక్షుడు డిఆర్ మహమ్మద్ కార్యదర్శిగా తిమ్మాపురం నవీన్‌ని నియమిస్తున్నట్లు తెలిపారు. నవీన్ సమాజం కోసం చేసిన కార్యక్రమాల నేపథ్యంలో కార్యదర్శిగా నియమించినట్లు తెలిపారు. అవినీతి, అక్రమాలపై ఇలాగే స్పందించాలని నవీన్‌కూ సూచిస్తూ గుర్తింపు కార్డు, ఉత్తర్వులను జారీ చేశారు. నా సేవలను గుర్తించి, నాపై నమ్మకంతో ఎన్‌హెచ్‌ఆర్‌సిలో అవకాశం కల్పించినందుకు నవీన్ జాతీయ కమిటీకి ధన్యవాదాలు తెలిపారు.



కార్యదర్శి నవీన్‌కు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న దశ్యం

'భవిష్యత్తుకు గ్యారెంటీ'ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-పెనుకొండ

'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించగా నియోజకవర్గ పరిశీలకులు నరసింహులు యాదవ్, ఆర్‌టిఎస్ జోనల్ ఇన్‌ఛార్జి మనోహర్‌నాయుడు, ఆర్‌టిఎస్ ట్రైనర్ పరిమళ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంపై బూత్ కన్వీనర్లు, యూనిట్, క్లస్టర్ ఇనాఛార్జులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు సిద్దయ్య, సిద్దలింగప్ప, నరహరి, రవిశంకర్, అశ్వర్థరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బికె పార్థసారథి

పేదలకు భూమిలిచ్చే వరకు పోరాటం

◆ సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ ◆ కోగిరలో 2వ రోజు కొనసాగిన భూస్వాధీన పోరాటం



రైతు కూలీలతో కలిసి భూస్వాధీన పోరాటం చేస్తున్న వ్యకాసం నాయకులు



పోలీసులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

ప్రజాశక్తి-రొద్దం

ఏళ్ల తరబడి సాగులో ఉన్న పేదల రైతు కూలీలకు భూములు ఇచ్చేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ స్పష్టం చేశారు. మండల పరిధిలోని కోగిర, కంబాలపల్లి, శ్యాపురం, బీదానుపల్లి గ్రామాలకు చెందిన వ్యవసాయ కూలీలు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూస్వాధీన పోరాటం కొనసాగిస్తున్నారు. శుక్రవారం ఉదయం కోగిర రెవెన్యూ గ్రామంలో వ్యకాసం, సిపిఎం ఆధ్వర్యంలో భూముల్లో నిరసన తెలిపారు. కూలీలు, రెండు ట్రాక్టర్లతో దుక్కి దున్ని భూములను చదును చేసి రాగులు, జొన్నలు విత్తారు. పేదలు భూముల్లో ఉన్నారన్న విషయం తెలుసుకున్న పోలీసులు వారి సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఈ సమయంలో పోలీసులను పేదలు, వ్యకాసం నాయకులు ప్రతిఘటించారు. 20 ఏళ్ల నుంచి సాగు చేస్తున్న ఈ భూమిని తమకు ఇవ్వకుండా ఇతరులకు ఇవ్వాలని చూడడం సరికాదన్నారు. ఇదే మా జీవనాధారం అని, ఈ భూమిని వదిలేది లేదని పోలీసులకు తేల్చి చెప్పారు. కళ్లముందే మా భూమి ట్రస్ట్ పేరుతో దురాక్రమణ అవుతుంటే చూస్తూ ఊరుకోమన్నారు. అక్కడి నుంచే పెనుకొండ సిఐ కరుణాకర్ ఫోన్ ద్వారా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్‌తో మాట్లాడారు. సమస్యను శాంతియుతంగా పరిష్కరించ కునేందుకు ఇరువర్గాలు శనివారం ఉదయం సిఐ కార్యాలయానికి రావాలని కోరారు. ఇంతియాజ్ స్పందిస్తూ చర్చలకు తప్పక వస్తామని, అంతవరకు స్వాధీన పోరాటాన్ని యథావిధిగా కొనసాగిస్తూనే ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు నారాయణ, వ్యవసాయ కూలీలు రామాంజినమ్మ, అనిత, సుబ్రహ్మణ్యం, బాలు, నారాయణ పాల్గొన్నారు.

'శ్రీరామిరెడ్డి' కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-పెనుకొండ

జిల్లాలోని మడకశిర, హిందూపురం డివిజన్‌కు సంబంధించిన శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారున. ఈ మేరకు శుక్రవారం డిఎస్‌పి హుస్సేన్‌పీరాకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో శ్రీరామిరెడ్డి వాటర్ స్కీం వర్కర్స్ బకాయి వేతనాలు, పిఎఫ్ కోసం ఆగస్టు 19వ తేదీ నుంచి సమ్మె చేపట్టామని తెలిపారు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లా కలెక్టర్, సంబంధిత జిల్లా అధికారులతో జరిగిన చర్చల్లో భాగంగా అనంతపురం జిల్లాలో కొంతమేరకు బకాయి వేతనాలు చెల్లించారన్నారు. మరుసటి రోజు మడకశిర, హిందూపురం డివిజన్‌కు సంబంధించిన కార్మికుల వేతన బకాయిలు గురించి చర్చించగా చెల్లించేలా చూస్తామని అధికారులు తెలిపారన్నారు. అలాగే మడకశిర, హిందూపురం డివిజన్లలో కాంట్రాక్టర్లు చెల్లించాల్సిన బకాయిలు, ఎస్ఎస్ఆర్ ప్రకారం వేతనంలో రూ. 2,500 కోత, పిఎఫ్ చెల్లించకుండా ఉన్నటువంటి పరిస్థితి ఉందన్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని దీనిని నిరసిస్తూ సమ్మె కొనసాగిస్తూ రేపటి నుంచి మడకశిర ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు డిఎస్‌పికి తెలిపారు. ఈ విషయంపై సోమవారం శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్, ఎంపిడిఒకు వినతి పత్రాలు సమర్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి, సిఐటియు జిల్లా, మండల కార్యదర్శులు రమేష్, బాబావలి, శ్రీరామిరెడ్డి వాటర్ స్కీం వర్కర్స్ యూనియన్ నాయకులు సుబ్బరాజు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.



డిఎస్‌పి హుస్సేన్‌పీరాకి వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, నాయకులు

రఘువీరాకు మార్కెట్ యార్డు సిబ్బంది సన్మానం

ప్రజాశక్తి-మడకశిర

సిడబ్ల్యూసి మెంబర్ ఎన్.రఘువీరారెడ్డిని శుక్రవారం మార్కెట్ యార్డ్ సిబ్బంది మండల పరిధిలోని నీలకంఠాపురం లో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రఘువీరా వారితో మార్కెట్ యార్డ్ స్థితిగతులపై చర్చించారు. రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలను మార్కెట్ యార్డ్‌లో నిర్వ హించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, సిబ్బంది కూడా తమవంతుగా రైతులకు ఉపయోగ కరంగా ఉండే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్ర మంలో కార్యదర్శి నాగేంద్రకుమార్, సిబ్బంది శ్రీరాములు, రవికుమార్, కుళ్లాయప్ప, రాజశేఖర్, తదితరులు పాల్గొ న్నారు.



రఘువీరాను సన్మానించిన మార్కెట్ యార్డు సిబ్బంది

'జగనన్న భూరక్ష'పై అవగాహన

ప్రజాశక్తి-సోమందేపల్లి

'జగనన్న భూరక్ష'లో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. 'జగనన్న భూరక్ష' పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోనే మొట్టమొదటిగా కొత్తపల్లి గ్రామాన్ని ఎంపిక చేశారు. ఇందులో భాగంగా గ్రామంలోని రైతుల భూములకు సంబంధించి సర్వే చేసి ప్రభుత్వమే హద్దులు ఏర్పాటు చేసి వారి ఆస్తికి సంబంధిం చిన రికార్డులను వారం రోజుల క్రితం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పని చేసిన పంచాయతీ కార్యదర్శి, సర్వేయర్, ఇతర ఉద్యోగులతో పాటు మండలం నుంచి శిక్షణ తీసుకొని వచ్చిన పంచాయతీ కార్యదర్శులు కృష్ణప్రసాద్, సావిత్రిలతో శ్రీసత్యసాయి జిల్లాలోని సచివాలయాల్లో పని చేసే గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించా మన్నారు. అలాగే మరో మూడు పర్యాయాలు వీరందరికీ ఫీల్డ్ శిక్షణ ఇస్తామని ఇఒఆర్‌డి నాగరాజురావు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచి మారుతిమమత, డిఎల్‌పిఒ శివనారాయణరెడ్డి, డివిజనల్ ఇంజినీర్ చిట్టిబాబు, ఇఒఆర్‌డి నసీమ, మండల సర్వేయర్ వినోద్‌కుమార్‌రెడ్డి, సర్వేయర్ ముద్దుగంగప్ప, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లినిక్‌కు వస్తే కాన్పు చేస్తా.. లేదా రెఫర్ చేస్తా..!

వైద్యురాలి బెదిరింపు.. బాధితులు వేడుకున్నా కనికరించని వైనం

ప్రజాశక్తి-హిందూపురం

సుఖ ప్రసవాలకు ప్రభుత్వ అసుపత్రికి రావాలని...ప్రభుత్వ అసుపత్రిలో నాడు-నేడు కింద అన్ని సౌకర్యాలు కల్పించామని ప్రభుత్వం చెబుతున్న మాటలు. ఇది చాలదన్నట్లు ఆశా, అంగన్వాడీ వర్కర్లతో పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. అయితే క్షేత్ర స్థాయిలో అందుకు భిన్నంగా ఉంది. ఇలాంటి ఘటన హిందూపురం జిల్లా ప్రభుత్వ అసుపత్రిలో నెలకొంది. ఈఘటనకు సంబందించి బాధితులు తెలిపిన వివరాలు.. హిందూపురం మండలం సంతేబిదనూరు గ్రామానికి చెందిన తులసి అనే మహిళను కర్నాటక రాష్ట్రం గౌరిబిదనూరు తాలుకు వాటంకొత్తపల్లికి చెందిన రాజు ఇచ్చి వివాహం జరిపించారు. తులసి ప్రస్తుతం సంతే బిదనూరు గ్రామంలో వాలంటీర్ గా విధులు నిర్వహిస్తోంది. ఆమె రెండవ సారి గర్భం దాల్చింది. వైద్యపరీక్షల నిమిత్తం రెండురోజుల క్రితం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చింది. వైద్య పరీక్షలు చేసిన వైద్యురాలు నీరజ మరో నాలుగు రోజుల్లో తులసికి కాన్పు అవుతుందని చెప్పింది. దీంతో వారు గ్రామానికి వెళ్లారు. అయితే శుక్రవారం పురిటి నొప్పులు రావడంతో ఆశావర్కర్ జయమ్మ సాయంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చింది. అయితే వైద్యురాలు నీరజ విధుల్లో లేక పోవడంతో విధుల్లో ఉన్న మరో వైద్యురాలు నాగసింధును సంప్రదించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యురాలు ఇక్కడ వైద్య సేవలను అందించలేనని తన సొంత క్లినిక్‌కు వస్తే ఆపరేషన్ చేస్తానని చెప్పింది. ఆపరేషన్‌కు రూ.30వేలు, ఇతర పరీక్షలకు అదనంగా ఖర్చు అవుతుందని తెలిపింది. దీంతో తులసి కుటుంబసభ్యులు తమ వద్ద అంతడబ్బు లేదని ఇక్కడే కాన్పుచేయాలని ఆ వైద్యురాలిని కోరారు. అందుకు ఆమె ససేమిరా అంది. వస్తే తన సొంత క్లినిక్‌కు రావాలని లేకుంటే అనంతపురం రెఫర్ చేస్తానని ఖరాఖండిగా చెప్పింది. దీంతో బాధితులు కర్నాటక రాష్ట్రం గౌరిబిదనూరుకు వెళ్లి, అక్కడి నుంచి చిక్కబళ్లాపురం వెళ్లారు. ఈ విషయంపై తులసి భర్త రాజు మాట్లాడుత తాను బేల్దారు పని చేసుకుని జీవనం చేస్తున్నానని డబ్బే ఉంటే బెంగళూరుకు తీసుకెళ్లి వైద్యం అందించే వాడిని అన్నారు. డబ్బుల కోసం ప్రభుత్వ అసుపత్రిలో ఇలా వేధిస్తారని అనుకోలేదని అన్నారు.



ఆసుపత్రిలోని మాత శిశు విభాగం

రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం..

బాధితులు వారికి జరిగిన అన్యాయంపై స్పందించి రాత పూర్వకంగా ఫిర్యాదు రాసి ఇస్తే విచారణ చేసి వైద్యురాలిపై చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదు చేయకుంటే ఏమి చేయలేం. అయినప్పటికి ఈ విషయంపై విచారణ జరిపిస్తాం.

- డాక్టర్ రోహిల్, ఆసుపత్రి సూపరింటెండెంట్

తాగునీటి సరఫరా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



జెసితో మాట్లాడుతున్న నాయకులు



ముదిగుబ్బలో కార్మికుల వినూత్న నిరసన

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలో మడకశిర, హిందూపురం డివిజన్లలోని శ్రీరామ్ రెడ్డి తాగునీటి సరఫరా కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్మికులతో కలసి వెంకటేష్ జిల్లా కలెక్టరేట్ లో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్‌కు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ రెండు డివిజన్లలో పనిచేస్తున్న కార్మికులకు బకాయిలు ఉన్న ఐదు నెలల వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని గత నెల 29 నుంచి సమ్మె చేస్తున్నారన్నారు. కార్మికులకు ఇస్తున్న వేతనంలో ఎస్ఎస్ఆర్ ప్రకారం కాకుండా 2500 రూపాయలు తగ్గించి కాంట్రాక్టర్ ఇస్తున్నారని విమర్శించారు. మరికొందరికి ఐదు నెలల నుంచి వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వేతనంలో కోత తో పాటు 18 నెలల పిఎఫ్ ఇవ్వకుండా మోసం చేస్తున్నారన్నారు. ఈ అన్యాయాన్ని ప్రశ్నిస్తే సూపర్వైజర్ నాగరాజు దూషిస్తూ వేధింపులకు గురి చేస్తూ బెదిరిస్తున్నాడన్నారు. వారిద్దరిపై చర్యలు తీసుకొని కార్మికులకు న్యాయం చేయాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షులు సుబ్బరాజు, నాయకులు గోపాల్, మురళి, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : వేతనాలు చెల్లించాలని కోరుతూ సత్య సాయి తాగునీటి పథకం కార్మికులు ఎనిమిదవ రోజు తమ నిరసన కొనసాగించారు. సత్యసాయి పంప్ హౌస్ ఎదుట ఒంటి కాలిపై నిలబడి నిరసన చేపట్టారు. ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు చంద్ర, కృష్ణా నాయక్, ధర్మానాయక్, గోపాల్ నాయక్, రాజు, అల్లిపీరా, అల్లా బకాష్, ముత్యాలప్ప రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రొద్దం : రొద్దం గ్రామానికి చెంది బైక్ మెకానిక్ హరి శుక్రవారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అతడు పావగడ వైపు నుంచి స్వగ్రామం వస్తుండగా మండల పరిధిలోని ఆర్.కొట్టాల వద్ద మలుపులో అదుపుతప్పి కల్వర్టు దిమ్మెను ఢీకొన్నాడు. విషయం తెలిసిన వెంటనే జమేందార్ కాంతప్ప అక్కడికి చేరుకొన్నారు. ఈ లోపు అటుగా వెళ్తున్న సచివాలయం-1 ఎఎన్ ఎం సాకమ్మ 108కి ఫోన్ చేసినా ఎంతసేపటికీ రాలేదు. దీంతో మదర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ ధనుం జయ వాహనంలో పెనుకొండ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

కుక్కలదాడిలో గొర్రెపిల్లలు మృతి

రొద్దం : మండల పరిధిలోని తురకలాపట్నం గ్రామంలో రైతు మిడిగేశి రామన్నకు చెందిన గొర్రెల రొప్పంపై శుక్రవారం కుక్కలు దాడి చేయడంతో 16 గొర్రెపిల్లలు మృతి చెందాయి. విషయం తెలుసుకొన్న సచివాలయ సిబ్బంది, వెటర్నరీ అసిస్టెంట్, తదితరులు వెళ్లి పరిశీలించారు. 2 గొర్రె పిల్లలు మృతి చెందే అవకాశాలు ఉన్నాయన్నారు. రూ. లక్ష నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు రామన్న కోరారు. నెల రోజుల క్రితం ఓ కుక్క దాదాపు 12 మందిని కరచినట్లు గ్రామస్తులు తెలిపారు.

రక్తదానంతో ప్రాణదానం

కదిరి అర్బన్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని జనసేన పట్టణ ఉపాధ్యక్షులు లక్ష్మన్న పేర్కొన్నారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో రక్తదాన , అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జన సేన పార్టీ ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్, నాయకులు చలపతి, కిన్నెర మహేష్ , గోపీనాథ్, హరీష్ వాల్మీకి , హరి బాబు తదితరులు రక్తదానం చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

పుట్టపర్తి రూరల్ : డెంగ్యూ, మలేరియా జ్వరాలు ప్రబలకుండా అప్రమత్తగా ఉండాలని పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య వైద్య సిబ్బంది సూచించారు. ఈ మేరకు వారు శుక్రవారం పుట్టపర్తి మండల పరిధిలోని కప్పల బండ, సుబ్బారాయుని పల్లి గ్రామాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ నగేష్ , పిహెచ్‌యన్ లలిత కుమారి, సూపర్ వైజర్ వెంకట రమణ, ఎంఎల్‌హెచ్‌పి అపర్ణ, సత్యమ్మ, ఆరోగ్య కార్యకర్త ప్రమీల, రాజశేఖర్, ఆశ కార్యకర్త జ్యోతి, శ్రీదేవి, లక్ష్మీదేవి వాలంటీర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు సేవా కార్యక్రమాలు : చిలకం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా ధర్మవరం పట్టణంలో శనివారం పలు సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తెలిపారు. తారకరామాపురంలోని బీసీ బాలుర హాస్టల్‌లో పుస్తకాలు, పెన్నులు, ఫ్యాన్లు పంపిణీ చేస్తామన్నారు. పోతుకుంట రోడ్డు విఆర్ఎల్ ట్రాన్స్పోర్ట్ ఆపోజిట్ దగ్గర నూతనంగా నిర్మిస్తున్న జన సేన పార్టీ కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు భవన నిర్మాణ కార్మికులతో భోజనాల కార్యక్రమం ఉంటుందన్నారు.

పట్టణ పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యత

హిందూపురం : పురపాలక సంఘ పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ అన్నారు. పట్టణంలోని ఆబాద్‌పేట, ముక్కడిపేట ప్రాంతంలో మురుగు కాలువలు సరిగా లేక పోవడంతో మురుగు కదలడం లేదని ఆ ప్రాంత ప్రజలతో పాటు వార్డు కౌన్సిలర్లు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ శుక్రవారం ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కలిసి మురుగు కాలువను పరిశీలన చేశారు. సమస్యను అక్కడిక్కడే పరిష్కరించారు. దగ్గర ఉండి కాలువలను శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఇర్షాద్, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పాల్గొన్నారు.



పోలీసుల సమస్యలు వింటున్న ఎస్పీ

పోలీసుల సమస్యల పరిష్కారానికి కృషి

పుట్టపర్తి రూరల్: పోలీసుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని శ్రీ సత్య జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి అన్నారు. శుక్రవారం పుట్టపర్తి లోనిపోలీస్ పరేడ్ మైదానంలో పోలీస్ దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పోలీసుల తమ సమస్యలను. ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల భద్రతను కాపాడే పోలీసులకు సమస్యలు ఉంటే వాటిని తీర్చే బాధ్యతను జిల్లా పోలీస్ అధికారిగా తనపై ఉందన్నారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ విజయ్ కుమార్, ఆర్ఐలు టైటస్, నారాయ తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం ఉపాధ్యాయుడికి రాష్ట్రస్థాయి అవార్డు

ప్రజాశక్తి బుక్కపట్నం

తాను చదివిన పాఠశాలలోనే ఉపాధ్యాయ వృత్తి చేపట్టి విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి రాష్ట్రస్థాయిలో ప్రకటించే ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డుకు ఎంపికయ్యారు. మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు అబ్దుల్ రహిమాన్ ఈనెల ఐదవ తేదీన విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డును ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా అందుకోనున్నారు. బుక్కపట్నానికి చెందిన అబ్దుల్ రహిమాన్ 1974 ,75 వ సంవత్సరంలో ఆరవ తరగతి, ఏడవ తరగతి ఈ పాఠశాలలోనే విద్యను అభ్యసించారు. తాను చదివిన పాఠశాలలోనే 2005 సంవత్సరం నుంచి 2015 వరకు ఉపాధ్యాయుడిగా కొనసాగారు. ఆ తర్వాత తాను చదివిన పాఠశాలకే ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో 2009 సంవత్సరంలో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డుకు ఎంపికయ్యారు. తాను చదివిన ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి ఎంతోమంది విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన ఉత్తమమైన, విలువలతో కూడిన విద్యను అందించారు. భగవాన్ సత్యసాయిబాబా చదివిన పాఠశాలకే ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టడం గర్వకారణమని 2024 సంవత్సరం తాను చదివిన పాఠశాలలోనే పదవి విరమణ పొందడం సంతోషకరమని తెలిపారు. క్రమశిక్షణకు మారుపేరుగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పినందుకు తనకు రాష్ట్రస్థాయి అవార్డు లభించడం సంతోషదాయకమని హెచ్‌ఎం అబ్దుల్ రహిమాన్ తెలిపారు. అవార్డు గ్రహీతకు తోటి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



అవార్డుకు ఎంపికైన ఉపాధ్యాయులు అబ్దుల్ రహిమాన్



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

ప్రజాశక్తి - గాండ్లపెంట

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ పథకానికి సంబంధించిన సామాజిక తనిఖీ ప్రజావేదికను శుక్రవారం నిర్వహించారు. 2022 - 23 సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులు పై 16వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. తనిఖీలో సేకరించిన నివేదిక ప్రకారం రెండు లక్షల నలభైఏడువేల నాలుగువందల ముఫై రూపాయలు అవినీతి జరిగినట్లు నిర్ధారించారు. కూలీలకు తక్కువ బిల్లులు పెట్టడం, బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్న కొంతమందికి కూడా బిల్లులు పెట్టినట్లు నిర్ధారించారు. అవినీతి జరిగిన సొమ్మును రికవరీ చేయడానికి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో సత్యసాయి జిల్లా అధికారులు పీడీ రామాంజనేయులు, విజిలెన్స్ ఆఫీసర్ రమణారెడ్డి, విజిలెన్స్ అసిస్టెంట్ రాజకుమార్, ఎపిడి శివశంకర్, ఎంపిడిఒ రామానాయక్, ఏపీవో మంజునాథ్, ఈసీ సుబ్బారెడ్డి, పిఆర్ జెఇ రెడ్డి ప్రసాద్, ఎంపీపీ జగన్మోహన్, వైసీపీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ సోమశేఖర్ రెడ్డి, సర్పంచులు ఎస్ రహమతుల్లా, రవీంద్ర నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.



గుండుమల తిప్పేస్వామి కి రాఖీ కడుతున్న ఝాన్సీ

టిడిపి కార్యాలయంలో 'రక్షాబంధన్'

ప్రజాశక్తి - మడకశిర

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామికి శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గుడిబండ మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు ఝాన్సీ రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గుండుమల మాట్లాడుతూ రక్షాబంధన్ అన్నా చెల్లెళ్ల అనుబంధాన్ని గుర్తు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, రాష్ట్ర నాయకులు, నియోజకవర్గ పరిశీలకులు పార్థసారధిరెడ్డి పాల్గొన్నారు.

లేపాక్షి ఆలయానికి యునెస్కో గుర్తింపునకు కృషి

పుస్తకావిష్కరణలో రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

ప్రజాశక్తి-గోరంట్ల

లేపాక్షి ఆలయానికి యునెస్కో గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కోవా లక్ష్మణ్ తెలిపినట్లు రచయిత మైనాస్వామి తెలిపారు. ఢిల్లీలో నిర్వహించిన 'టెంపుల్ ఆర్కిటెక్చర్ అండ్ ఆర్ట్ ఆఫ్ విజయనగర లేపాక్షి' పుస్తకావిష్కరణ కార్యక్రమానికి లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విజయనగర సామ్రాజ్య కాలం నాటి శిల్పకళపై మరింత పరిశోధన చేయాలని, ఉన్న వాటిని పరిరక్షించాలని సూచించారు. లేపాక్షి ఆలయంపై పరిశోధన చేసి పుస్తకాన్ని ఆంగ్లభాషలో తీసుకొచ్చినందుకు రచయిత మైనాస్వామిని అభినందించారు. రచయిత మైనాస్వామి మాట్లాడుతూ విజయనగర సామ్రాజ్య కాలం నాటి ఆలయాలు, శిల్పకళపై మరింత లోతైన పరిశోధనలు చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఫారిన్ కరస్పాండెంట్ క్లబ్ ఆఫ్ సౌత్ ఏషియా(ఎఫ్సీసీ) అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ ఎస్.వెంకటనారాయణ్, పిఆర్ఎస్ఎస్ఐ అధ్యక్షుడు అజిత్ పాఠక్, ఇరెడా ఇండిపెండెంట్ డైరెక్టర్ డాక్టర్ జగన్నాథ్ సి.జోడిదర్, ఎస్‌విబిసి డైరెక్టర్ వసంత కల్పన, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ నూతన భవనం ప్రారంభం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని 13వ వార్డు పరిధిలోని పోస్టల్ కాలనీ వద్ద నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని సిడిపిఒ రెడ్డి రమణమ్మ, స్థానిక వార్డు కౌన్సిలర్ సునీత వెంకటేశ్వర రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు అంగన్వాడి ద్వారా లభించే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శాంతి, అంగన్ వాడీ వర్కర్లు అరుణ, లక్ష్మి, శైలజ, అమృతవల్లి, అనిత, నారాయణమ్మ, వైసిపి నాయకులు సడ్లపల్లి శబరీష్ రెడ్డి, హనుమంత రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎపి జెసి ఆధ్వర్యంలో ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి- హిందూపురం

సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని యూటిఎఫ్, ఏపీ ఎన్‌జిఒ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ఉద్యగులు నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపి, డిప్యూటి తహశీల్దార్‌కు వినతిని ఇచ్చారు. ఈ సందర్భంగా యూటిఎఫ్ నాయకులు మారుతీ శ్రీనివాస్, ఎన్‌జిఒ అధ్యక్షులు నరసింహులు మాట్లాడుతు 2004 సెప్టెంబర్ 1 నుండి అమలులోకి వచ్చిన సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలిన్నారు సిపిఎస్ విధానం అమలులోకి వచ్చిన సెప్టెంబర్ 1వ తేదీన సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు విద్రోహ దినంగా పరిగణిస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చి 4 సంవత్సరాలు గడిచినా ఒపిఎస్‌ను అమలు చేయకపోగా గ్యారెంటీ లేని జీపిఎస్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు తీసుకురావడం అన్యాయమన్నారు. సిపిఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పోరాటాలకు పిలుపునిస్తే ప్రభుత్వం అధికారులు ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురి చేస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేసే వరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ పోరాటానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు సంఘటితంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఒ నాయకులు సాయినాథ్, అశ్వర్థ, యుటిఎఫ్ నాయకులు బాబు, సీతాలక్ష్మి, మహంతి, గంగిరెడ్డి, చెన్నకేశవులు, రంగనాథ్, సుల్తాన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



డిటికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

టిడిపి నాయకుని మృతికి నివాళి

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

మండల పరిధిలోని బాచన్నపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ వేణుగోపాల్ గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే టిడిపి జిల్లా అధ్యక్షుడు బికె పార్థసారథి బాచన్నపల్లి గ్రామం వెళ్లి వేణుగోపాల్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈయన మృతి టిడిపికి తీరని లోటని, పార్టీకి ఆయన సేవలు మరువలేనివని తెలిపారు. అలాగే ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సోమశేఖర్, ప్రధాన కార్యదర్శి అశ్వత్థరెడ్డి, మైనార్టీ సహాయ కార్యదర్శి అజంతుల్లా, బాలకృష్ణచౌదరి, వెంకటరెడ్డి, జయరాం, నరేంద్ర రాయల్, ఉత్తమ్‌రెడ్డి, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛన్లు పంపిణీ

సోమందేపల్లి : మండల పరిధిలోని గుడిపల్లి గ్రామ సచివాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి నాగార్జున రెడ్డి, సర్పంచి గిరిజమ్మ నాగరాజరావు ఆధ్వర్యంలో నూతనంగా మంజూరైన పింఛన్లను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ సచివాలయానికి నూతనంగా 29 పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీదేవి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

రైతులకు రాయితీతో ప్రత్యామ్నాయ విత్తనాలు

బత్తలపల్లి : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు రాయితీతో విత్తనాలు పంపిణీ చేస్తున్నఉట్ల వ్యవసాయ అధికారి రమాదేవి తెలిపారు. ఉలవ 10 కేజీల ప్యాకెట్ రూ216, పెసలు 4 కేజీలు రూ94లుగా ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. 80శాతం రాయితీతో ప్రత్యామ్నాయంగా ఉలవలు, పెసలు మరియు అలసందలను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం తాడిమర్రి రైతు భరోసా కేంద్రంలో ఉలవలు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల అగ్రి అడ్వైజర్ బోర్డు చైర్మన్ పురుషోత్తం రెడ్డి గారు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

బత్తలపల్లి : జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ ఉపాధిహామీ పథకంలో 2018 నుంచి 2023 సంవత్సరాల కాలంలో ఏదో ఒక సంవత్సరం వంద రోజులు పని పూర్తి చేసుకున్న కుటుంబాల్లోని నిరుద్యోగ యువతకి ఉచితంగా కంప్యూటర్ కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంగ్లీష్ నైపుణ్యం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు ఎపిఒ ఆదెప్ప, ఎపిఎం సుదర్శన్ రాజు, జాబ్స్ కోఆర్డినేటర్ అనంతలక్ష్మీ తదితరులు శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో వంద రోజులు పని దినాలు పూర్తి చేసుకున్న కుటుంబాల్లోని నిరుద్యోగులకు ఇది మంచి అవకాశమన్నారు. కనీస అర్హతలు ఇంటర్ పాస్ లేదా ఏదైనా డిగ్రీ పట్టా పొంది 18 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాలు వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఈ నెల 5వ తేదీలోపు బత్తలపల్లి భారత్ మండల సమాఖ్య కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7702100238, 9182316114 నెంబరులో సంప్రదించాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారం

హిందూపురం : రూరల్ మండల పరిధిలోని రాచపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెలకొన్న తాగనీటి సమస్యను సర్పంచి ఉపేంద్రకుమార్‌రెడ్డి శుక్రవారం పరిష్కరించారు. విషయం తెలుసుకున్న సర్పంచి ఉపేంద్ర కుమార్ రెడ్డి పాఠశాలకు ప్రతి రోజు మినరల్ వాటర్ ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

పుట్టపర్తి అర్బన్ : సిపిఎస్ ను రద్దుచేసి పాత పింఛను విధానాన్ని పునరుద్దించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ డిమాండ్ చేశారు. జిల్లాలోని సంఘం ప్రతినిధులు పట్టణంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్‌లో కలెక్టర్ అరుణ్ బాబు కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం కోశాధికారి నారాయణరెడ్డి, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం

పుట్టపర్తి అర్బన్ : చిన్న పత్రికలకు అక్రిడిటేషన్లు మంజూరు చేసినందుకు జిల్లాలోని చిన్న పత్రికల ఎడిటర్లు కలెక్టర్ అరుణ్ బాబును శుక్రవారం సన్మానించారు. కలెక్టరేట్‌లోకలెక్టర్ ను కలిసి పూలమాలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు పుల్లయ్య, చిన్న పత్రికల ఎడిటర్లు గోకుల చక్రపాణి, రమణ, తాజుద్దీన్, శివప్ప, నల్లమడ గంగరాజు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తండాలో పౌర హక్కుల దినోత్సవం

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని బడే నాయక్ తండాలో రెవెన్యూ అధికారులు ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ నవీన్ కుమార్ కాలనీలోని మౌలిక వసతులపై ఆరా తీశారు. అంటరానితనం, రెండు గ్లాసుల పద్ధతి అవలంబించరాదన్నారు. దేవాలయాల ప్రవేశం, ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు.వ్యవసాధికారి వెంకట బ్రహ్మం మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్లో పంట నమోదు పక్రియ కచ్చితంగా చేసుకోవాలన్నారు రైతులకు అందించే సబ్సిడీ, ప్రభుత్వ పథకాలు గురించి వివరించారు. ఎఎస్ఐ విజయుడు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు, బాల్యవివాహాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని అమకొండపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యాసామాగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. పుట్టపర్తి కిద్మత్ ఏ ఖల్క్ ట్రస్ట్ సభ్యుడు షామీర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, పెన్సిల్ బాక్సులు తదితర విద్యాసామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు షామీర్ మాట్లాడుతూ తమ సంస్థలో సభ్యుడైన అలీ కుమారుడు జాక్వన్ జన్మదిన సందర్భంగా వీటిని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు పుట్టపర్తి మండలంలోనే కాక కొత్తచెరువు, బుక్కపట్నం, గోరంట్ల మండలా లలో ఎన్నో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివ, ఖాజా హుస్సేన్, చాందు, బక్షి పాల్గొన్నారు.

కౌలు రైతులకు వైఎస్ఆర్ రైతు భరోసా

బత్తలపల్లి : మండలంలో అర్హులైన 12 మంది కౌలు రైతులకు రైతు భరోసాను ప్రభుత్వం ఇచ్చిందని ఎఒ ఓబిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఒక్కొక్క కౌలురైతు ఖాతాలో 13,500లు జమ చేసినట్లు చెప్పారు.